సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



తప్పని తాగునీటి కష్టాలు!

పల్లెల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. పెద్దేముల్ మండలం ఆత్కూర్‌లో గ్రామస్తులు తాగునీటికి తండ్లాడుతున్నారు. 8లో▸



ప్రణాళికాబద్ధంగా చదవాలి

ప్రతీ విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఉత్తీర్ణత సాధించొచ్చని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి పేర్కొన్నారు. 8లో▸



సాగు.. భారమే!

పంటల సాగు రైతులకు భారంగా మారుతోంది. పెట్టుబడి ఖర్చులు పెరగడంతో రైతులు అప్పులపాలవుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ముగిసిన కార్యదర్శుల బదిలీ ప్రక్రియ

గోనూర్, చెంగోల్ పంచాయతీలకు ఇన్‌చార్జిల నియామకం

తాండూరు రూరల్: వారం రోజులుగా కొనసాగుతోన్న పంచాయతీ కార్యదర్శుల బదిలీల ప్రక్రియ గురువారంతో ముగిసింది. ఆయా పంచాయతీలకు కొత్తగా పంచాయతీ కార్యదర్శులు రావడంతో పాటు గోనూరు, చెంగోల్ గ్రామాలకు ఇన్‌చార్జిలను నియమించినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. కోటబాసుపల్లి కార్యదర్శిగా శ్రావణి, సంకిరెడ్డిపల్లి కార్యదర్శిగా మల్లికార్జున్ బాధ్యతలు స్వీకరించారని చెప్పారు. వీర్‌శెట్టిపల్లి కార్యదర్శి నజీర్‌కు గోనూర్, గౌతపూర్ పంచాయతీ కార్యదర్శి ఫక్రొజీకు చెంగోల్ గ్రామాలకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని చెప్పారు.

స్టోన్ కార్వింగ్‌లో సత్తా



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న పూజాచారి

కుల్కచర్ల: ఆల్ ఇండియా వార్షిక ఆర్ట్ ఎగ్జిబిషన్-2025లో మండల పరిధిలోని మరికల్ గ్రామానికి వద్ద పూజాచారి సత్తా చాటింది. హైదరాబాద్ జేఎన్‌టీయూ కళాశాలలో నిర్వహించిన హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ 84వ ఎగ్జిబిషన్‌లో వివిధ రాష్ట్రాల కళాకారులు హాజరయ్యారు. ఇందులో ఫైన్ ఆర్ట్స్ విద్యార్థిని పూజాచారి స్టోన్ కార్వింగ్(రాతిశిల్పం)లో అత్యంత ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు గురువారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమెకు ఎక్సలెన్స్ అవార్డుతో పాటు రూ.25వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

యాదయ్య త్యాగం వెలకట్టలేనిది

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



నాగారంలో యాదయ్య సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసిన సిరిపురం యాదయ్య త్యాగం వెలకట్టలేనిదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం యాదయ్య వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామమైన నాగారంలోని సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 21 ఏళ్ల వయసులో తెలంగాణ సాధన కోసం ఉస్మానియా యూనివర్సిటీలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ప్రాణత్యాగం చేసుకున్న యాదయ్య ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన మహేశ్వరంవాసి కావడం ఈప్రాంతానికి గర్వకారణమన్నారు. తెలంగాణ కోసం మరణించిన అమరుల కుటుంబాలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం గుర్తించి ఆదుకుందన్నారు. అమరుడైన యాదయ్య ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యాదయ్య కుటుంబ సభ్యులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కులగణన రీ సర్వేకు సహకరించండి

బీసీ కమిషన్ సభ్యుడు జయప్రకాశ్



నాయకులతో సమావేశమైన బీసీ కమిషన్ సభ్యుడు జయప్రకాశ్

హుడాకాంప్లెక్స్: కులగణన రీ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని బీసీ కమిషన్ సభ్యుడు రాపోలు జయప్రకాశ్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో పలు ఆరోపణలు వచ్చినందున తిరిగి సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం ఆయన సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, పార్టీ సరూర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్‌లతో సమావేశమై కులగణనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణనలో పాల్గొనని వారు ప్రస్తుతం రీ సర్వేలో తమ పేర్లను కులాల వారీగా నమో దు చేసుకోవాలన్నారు. కుల సంఘాల అభివృద్ధి, సంక్షేమానికి దోహదపడాలని పేర్కొ న్నారు.



ఎల్లమ్మ తల్లి పల్లకీ సేవలో భక్తజనం



ఊరేగింపులో కళాకారుల ప్రదర్శనలు

జగజ్జనని జాతర

పోలేపల్లిలో ప్రారంభమైన ఎల్లమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు

- ముగిసిన చక్రస్నానం, పల్లకీసేవ
- నేడు ముఖ్యమంత్రి ప్రత్యేక పూజలు
- భారీగా మోహరించిన పోలీసులు
- కలెక్టర్, ఐజీ, ఎస్పీల పర్యవేక్షణ

బొంరాస్‌పేట: జగజ్జనని పోలేపల్లి ఎల్లమ్మ ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులు నిర్వహించే ఉత్సవంలో తొలి రోజు కోనేరు లో అమ్మవారి చక్రస్నానం నిర్వహించి డప్పు చప్పుళ్లు, డోలు వాయిద్యాల నడుమ పల్లకీసేవ చేపట్టారు. ఉదయంనుంచే భక్తులు పెద్దఎత్తున హాజరై పూజలు చేశారు.

నేడే సిడె

జాతరలో ప్రధాన ఘట్టమైన సిడె ఉత్సవం శుక్రవారం సాయంత్రం జరగనుంది. సిడె అనే కొయ్యకు నిమ్మకాయలు, పూలతో అలంకరించిన ఊయల కడతారు. ఇందులో అందంగా అలంకరించిన అమ్మవారి ఉత్సవమూర్తిని ఉంచి ఆలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు చేస్తారు. ఈ సమయంలో భక్తులు అమ్మవారిపై గవ్వలు చల్లుతూ ఎల్లమ్మ తల్లి సల్లంగా చూడమ్మా అంటూ వేడుకుంటారు. ఈ కార్యక్రమానికి లక్షకు పైగా భక్తులు హాజరవుతారని అంచనా. ఇప్పటికే ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు సిద్ధం చేశామని ఆలయకమిటీ చైర్మన్ జయరాములు, ఈఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

ముఖ్యమంత్రి రాక

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం తన సొంత నియోజకవర్గంలోని పోలేపల్లి ఎల్లమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు గట్టిబందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని ఎస్పీ నారాయణరెడ్డి వెల్లడించారు. డీఎస్పీలు, సీఐ, పలువురు ఎస్‌ఐలు, ఇతర కానిస్టేబుళ్లు, ప్రత్యేక బలగాలు జాతరలో మోహరించాయి.



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, చిత్రంలో ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, వెంకట్‌రెడ్డి

ఉన్నతాధికారుల పర్యవేక్షణ

జాతర ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలు, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, మల్టీజోన్ ఐజీ సత్యనారాయణ, ఎస్పీ నారాయణరెడ్డి, కడా అధికారి వెంకట్‌రెడ్డి పర్యవేక్షించారు.

అమ్మవారి పాటను ఆవిష్కరించిన కలెక్టర్

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ చైర్మన్ జయరాములు రూపొందించిన పోలేపల్లి ఎల్లమ్మ దేవత పాటను కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆవిష్కరించారు. 'ఎల్లు ఎల్లమ్మ రావే'.. అనే పాట భక్త జనాన్ని ఆకట్టుకుంటుందని రచయిత, గాయకుడిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ట్రెయినీ కలెక్టర్ ఉమాహారతి, సింగర్ నర్సింహ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, రాంచంద్రారెడ్డి, నర్సింలునాయుడు తదితరులున్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: జాతీయ లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో గురువారం వికారాబాద్‌లోని కోర్టు ఆవరణలో ఆయన జిల్లా పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా ఠాణాల వారీగా రాజీకి సిద్ధంగా ఉన్న కేసుల వివరాలపై ఆరా తీసి కేసులు పరిష్కరించాలన్నారు. చిన్న చిన్న తగాదాలు, మోటార్ వాహనాల కేసులు, ఇతర రాజీపడే కేసుల విషయంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చొరవ తీసుకోవాలన్నారు. రాజీ మార్గమే రాజమార్గమనే విషయాన్ని తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిషోర్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి డీబీ శీతల్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, పీపీలు దీపారాణి, అన్వేష్‌సింగ్, సమీనాబేగం, జిల్లా ఆబ్కారీ శాఖ అసిస్టెంట్ సూపరిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, మోమిన్‌పేట ఎస్‌ఐ అరవింద్, సంబంధిత అధికారులు, తదితతరులు పాల్గొన్నారు.

యాప్రాల్‌లో దాడికి కుట్ర

- దుష్ట శిక్షణ.. శిష్ట రక్షణ కోసం పనిచేయాలని ప్రతిజ్ఞ
- రామరాజ్య స్థాపనకు సహకరించని వారిని అడ్డు తొలగించాలని దిశానిర్దేశం
- పోలీసుల విచారణలో వెల్లడించిన వీర రాఘవరెడ్డి?
- ముగిసిన మూడు రోజుల కస్టడీ
- నేడు కోర్టులో హాజరుపర్చనున్న పోలీసులు

మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌పై దాడి చేసి, కస్టడీలో ఉన్న వీర రాఘవరెడ్డి విచారణ ముగిసింది. దాడికి సంబంధించిన కీలక విషయాలను పోలీసులు ఆయన నుంచి రాబట్టే ప్రయత్నం చేశారు. 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితుడిని కోర్టు అనుమతితో పోలీసులు మూడు రోజుల కస్టడీకి తీసుకున్న విషయం తెలిసిందే. విచారణ చివరిరోజైన గురువారం ఉదయం మొయినాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి వీర రాఘవరెడ్డిని నగరంలోని యాప్రాల్‌కు తీసుకెళ్లారు. రంగరాజన్‌పై దాడికి ముందు రెండు రోజులపాటు రామరాజ్యం సైన్యంతో యాప్రాల్‌లోని ఓ ఇంట్లో వీర రాఘవరెడ్డి సమావేశం నిర్వహించాడు. అక్కడే దాడికి కుట్ర జరిగిందనే విషయాలను నిందితుడి నుంచి రాబట్టారు. రెండు రోజుల సమావేశంలో ఏయే అంశాలపై చర్చ జరిగింది? అనే విషయాన్ని పోలీసులు ఆరా తీశారు. రామరాజ్య స్థాపనలో దుష్ట శిక్షణ శిష్ట రక్షణకోసం పనిచేయాలని.. అందుకు సహకరించనివారి అడ్డు తొలగించుకోవాలని వీర రాఘవరెడ్డి సైన్యంతో ప్రతిజ్ఞ చేయించినట్లు సమాచారం. అక్కడి నుంచి నిందితుడిని మణికొండలోని తన నివాసానికి తీసుకెళ్లి పరిశీలించారు. ఇంట్లో పోలీసులకు కొన్ని ఆధారాలు లభించాయి. అనంతరం రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయానికి తలరించారు. డీసీపీ శ్రీనివాస్, వీర రాఘవరెడ్డిని పలు ప్రశ్నలు అడిగి కీలక విషయాలను రాబట్టారు. చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చి రంగరాజన్‌పై దాడి చేయడానికి ముందు ఏం జరిగిందనే విషయాలను తెలుసుకున్నారు. మూడు రోజుల విచారణలో రాబట్టిన కీలక విషయాలతో నివేదిక రూపొందించారు. గురువారం కస్టడీ ముగిసిన నేపథ్యంలో శుక్రవారం అతన్ని కోర్టులో హాజరుపర్చనున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను సైతం శుక్రవారం కోర్టులో సమర్పించనున్నారు.

క్రీడలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి
- శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్



క్రీడాకారులతో కరచాలనం చేసుకుంటున్న స్పీకర్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో వికారాబాద్‌లో 34వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తోంది. గురువారం స్పీకర్ ప్రసాద్ కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు క్రీడలు, వ్యాయామానికి కొంత సమయం కేటాయించాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం పెంపొందుతుందన్నారు. ప్రతిభగల క్రీడాకారులకు తమ ప్రోత్సాహం ఉంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ నెలకొల్పేందుకు పూనుకున్నారన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి హన్మంత్‌రావు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరుశురాంనాయక్, ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఆనంద్, డీసీసీబీ డైరక్టర్ కిషన్‌నాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మురళి, వెంకటరెడ్డి, పీడీలు, పీఈటీలు, నాయకులు, యువజన నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

తీరని దాహం

పశువుల దాహార్తిని తీర్చేందుకు గత ప్రభుత్వం ఆరేళ్ల క్రితం నీటి తొట్ల నిర్మాణానికి పూనుకుంది. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా వీటిని నిర్మించారు. ఒక్కో నీటితొట్టి నిర్మాణానికి రూ.18 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేశారు. ఓ వైపు పశువులు తాగేందుకు నీరు లేక అల్లాడుతున్నా తొట్లను నింపడం లేదు. జిల్లాలోని ఎన్నో గ్రామాల్లో ఇదే పరిస్థితి దాపురించింది. మరి కొన్ని గ్రామాల్లో నేలమట్టం చేసిన దుస్థితి.

– వికారాబాద్

- రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన నీటి తొట్లు
- నిర్వహణ లేక నిరుపయోగంగా మారిన వైనం
- గుక్కెడు నీళ్లు దొరక్క ఇబ్బంది పడుతున్న మూగజీవాలు

మేతకు వెళ్లిన పశువుల దాహార్తి తీర్చేందుకు పొలాలు, బంజరు భూముల్లో నీటి సౌకర్యం కల్పించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఈజీఎస్(ఉపాధిహామీ పథకం)లో లక్షలాది రూపాయలు వెచ్చించి నీటి తొట్లను నిర్మించింది. వీటి నిర్మాణ బాధ్యతలను ప్రజాప్రతినిధులకు అప్పగించారు. ఇదే అదనుగా భావించిన కాంట్రాక్టర్లు, ప్రజాప్రతినిధులు వారికి ఇష్టమొచ్చిన చోట నిర్మించారు. కొన్ని చోట్ల నాసిరకంగా నిర్మించడంతో మూణ్నాళ్ల ముచ్చటగా మారి శిథిలావస్థకు చేరాయి. వీటిని నిర్మించే సమయంలో నీటి వసతి ఉందో లేదో గమనించలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. మరికొన్ని చోట్ల నీరున్నా.. పైపులైన్ కనక్షన్ లేకపోవటం తదితర కారణాలతో వినియోగంలోకి తీసుకురాలేకపోయారు. దీంతో నీటితొట్ల నిర్మాణ లక్ష్యం నెరవేరలేదు.

పశువులకు నీటి సౌకర్యం కల్పించడానికి ఏర్పాటుచేసిన తొట్లు వినియోగంలోని తెచ్చేందుకు పశుసంవర్ధకశాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉన్నా ఎవరికి వారే యమునా తీరే అనే

సమన్వయలోపం.. జీవాలకు శాపం

చందంగా తయారైంది. తొట్లకు నీటి సరఫరా చేసే విషయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం చర్యలు తీసుకోవాలి. ఇందుకు గ్రామస్థాయిలో పంచాయతీరాజ్ శాఖ సహకరించాలి. ఈ ప్రక్రియను పశుసంవర్ధకశాఖ పర్యవేక్షించాల్సి ఉంది. వీరి మధ్య సమన్వయలోపం కారణంగా పశువులకు గుక్కెడు నీరు లభించడం కష్టంగా మారింది. కనీసం గ్రామ ప్రజాప్రతినిధులైనా స్పందించి నీటితొట్లను వినియోగంలోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులే కాంట్రాక్టర్లు

ఆరేళ్ల క్రితం ఉపాధిహామీ పథకంలో భాగంగా 18 మండలాల్లో 617 నీటి తొట్లు నిర్మించాలని నిర్ణయించారు.ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ.18 వేల చొప్పున రూ.1.39కోట్ల నిధులు మంజూరు చేసింది. 400 పైచిలుకు తొట్లు నిర్మించి మిగిలినవి వదిలేశారు. వీటిని కాంట్రాక్టర్లే నిర్మించాలనే నిబంధనలున్నప్పటికీ చాలా వరకు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులే నిర్మించారు. ఏనాడు వాటిని నీటితో నింపిన దాఖలాలు కనిపించలేదు. జిల్లా వ్యాప్తంగా 6,23,000 మూగజీవాలున్నట్లు పశుసంవర్ధక శాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి. వాటి దాహార్తి తీర్చకపోగా లక్షలాది రూపాయల నిధులు నిరుపయోగం చేశారని పశుపోషకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న వాటిలోనైనా నీరు నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



దోమ మండలం మోత్కూర్‌లో నిరుపయోగంగా మారిన పశువుల నీటి తొట్టి

'ఉపాధి'ని వినియోగించుకోండి

డీఆర్డీఏ పీడీ శ్రీలత

కేశంపేట: గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ శ్రీలత సూచించారు. గురువారం మండల పరిధిలోని సంతాపూర్, బోధునంపల్లి, చౌలపల్లి, నిర్దవెళ్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన నర్సరీలు, ఫార్మేషన్ రోడ్డు పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ఉపాధి పనుల్లో కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. నిబంధనల ప్రకారం పనిచేస్తే రోజు కూలీ రూ.300 పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన మొక్కలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆమె వెంట ఏపీడీ శ్రీచరణ్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్ సంధ్య, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, ఏపీఓ అజీజ్, టీఏ నీలకంఠబాబు తదితరులు ఉన్నారు. అంతకుముందు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన 'ఆరోగ్యం– పోషకాహారం' శిక్షణ సదస్సులో పీడీ ప్రసంగించారు.



జాతరకు పెద్ద ఎత్తున హాజరైన మహిళలు

ఘనంగా గడ్డ మైసమ్మ జాతర

- ధన్నారంలో భక్తుల కిటకిట
- ఉత్సవాలకు హాజరైన స్పీకర్ ప్రసాద్ కుమార్

అనంతగిరి: మున్సిపల్ పరిధిలోని దన్నారం గ్రామంలో గడ్డ మైసమ్మ జాతర గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు వచ్చిన భక్తులు, బంధుమిత్రులతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఉత్సవాలకు హాజరైన స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆలయం వరకు రూ.30లక్షల నిధులు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. పూజల అనంతరం ఆలయ కమిటీ స్పీకర్‌ను ఘనంగా సన్మానించంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సుధాకర్‌రెడ్డి, కిషన్‌నాయక్, రాంచంద్రారెడ్డి, రత్నారెడ్డి, సత్యనారాయణ, మైపాల్‌రెడ్డి, చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్

క్లుప్తంగా

అందరికీ అండగా కాంగ్రెస్
తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



ఎల్ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలందరికీ అండగా ఉంటుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఫర్హానా బేగం అనారోగ్యంతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేశారు. దీంతో బాధితురాలికి మంజూరైన ఎల్ఓసీని గురువారం ఎమ్మెల్యే ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే వెంట కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం
అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం



అల్పాహారం చేస్తున్న ఎస్సీ బాలుర వసతి గృహ విద్యార్థులు

యాలాల: వసతి గృహ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో ఉదయం అల్పాహారంలో బోండా, చట్నీ విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెడ్లు, రోజువారీ అవసరాల వస్తువులు, తదితర వాటిని ఇప్పటికే అందించామన్నారు.

రొంపల్లిలో వాటర్‌షెడ్, ఈజీఎస్ పనుల పరిశీలన



రొంపల్లిలో పనులు పరిశీలిస్తున్న వాస్కన్ టీం మెంబర్స్

బంట్వారం: మండల పరిధిలోని రొంపల్లిలో ఎంఎస్ స్వామినాథం రీసెర్చ్ సంస్థ వాస్కన్ టీం మెంబర్స్ గురువారం సంయుక్తంగా సందర్శించి వాటర్‌షెడ్, ఈజీఎస్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మొక్కల పెంపకం, నీటి నిల్వ పనులు, మట్టి నిల్వ, భూమిలో నీటిని ఇంకింపజేయడం తదితర పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. వాస్కన్ టీం మెంబర్స్ లక్ష్మీకాంతం, రిటైర్డ్ డీఎఫ్ఓ సయ్యద్‌మీర్, స్టేట్ కోఆర్డినేటర్ రాంగోపాల్, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ అశోక్‌రెడ్డి, ఎఫ్ఏ శంకరయ్య, రైతులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలకు ఆహ్వానం



మహేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

బంట్వారం: శివభక్త మార్కాండేయ ఆలయ వార్షికోత్సవానికి మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిని ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. గురువారం నగరంలోని ఆయన నివాసంలో కోట్‌పల్లి నాయకులు, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆహ్వానపత్రిక అందజేశారు. మార్చి 1 నుంచి వార్షికోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

తప్పని తాగునీటి కష్టాలు!

- ఫైప్‌లైన్ లీకేజీతో ఆత్కూర్‌లో అవస్థలు
- రెండు రోజులుగా నిలిచిపోయిన నీటి సరఫరా
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



సింగిల్ ఫేజ్ మోటారు వద్ద తాగునీటిని పట్టుకుంటున్న గ్రామస్తులు

తాండూరు రూరల్: వేసవికాలం రాకముందే పల్లెల్లో నీటి కష్టాలు మొదలయ్యాయి. పెద్దేముల్ మండలం ఆత్కూర్ గ్రామంలో గ్రామస్తులు తాగునీటికి తండ్లాడుతున్నారు. వారం రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. సంగమేశ్వర ఆలయం వద్ద బోరు మోటారు నుంచి గ్రామానికి తాగునీటి పైప్‌లైన్ ఉంది. ఈ పైప్‌లైన్ తరచూ లీకేజీలకు గురవుతుంది. తాగు నీటి నీటి సమస్యను పట్టించుకునే వారు కరువయ్యారు. ఈ క్రమంలో మళ్లీ కొన్ని రోజుల నుంచి పైప్‌లైన్ లీకేజీతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. అటు మిషన్ భగిరథ నుంచి నీరు సక్రమంగా రాకపోవడంతో, ఇటు పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో ఆత్కూర్‌లో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. గ్రామంలో ఉన్న సింగిల్ ఫేజ్ మోటార్ల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని గ్రామ ప్రజలు చెబుతున్నారు. ఒక వేళ కరెంట్‌పోతే ఆ నీరు కూడా పట్టుకోవడం కష్టమౌతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే రాబోయే మూడు నెలలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు తప్పవని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు దృష్టిసారించి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం...

ఆత్కూర్‌లో నెలకొన్న తాగునీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. గ్రామ సమీపంలోని బ్రిడ్జి నుంచి మొయిన్‌రోడ్డు వరకు కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి రూ.2 లక్షలు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ ఎవరూ కూడా ముందుకు రావడంలేదు. ఊరు లోతట్టు ప్రాంతంలో ఉండటంతో మిషన్ భగిరథ నీటి సరఫరా ఇబ్బందికరంగా మారింది. కొత్త పైప్ లైన్ వేస్తే గ్రామానికి శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించొచ్చు.

– అర్చన, పంచాయతీ కార్యదర్శి, ఆత్కూర్

ప్రణాళికాబద్ధంగా చదవాలి

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



పరిగి: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న రేణుకాదేవి

పరిగి: ప్రతీ విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఉత్తీర్ణత సాధించొచ్చని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని నంబర్ 1 ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీఫైనల్ పరీక్షల విధానాలను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి, మంచి ఫలితాలు తీసుకురావాలన్నారు. ఉన్నత చదువులకు పదోతరగతి పునాది లాంటిదన్నారు. కావున చదవుపై ఎవ్వరూ నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు కనీసం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు సూచనలు, సలహాలు అందించాలన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని అన్నారు. మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తేనే ఉన్నత విద్యలో మంచి అవకాశాలు అందుతాయన్నారు. ప్రతీ విద్యార్థికి పదో తరగతి ఎంతో ముఖ్యమన్నారు. చదువులో ఎలాంటి సందేహాలు ఉన్న వెంటనే ఉపాధ్యాయుని సలహాలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను గ్రూపులుగా చేసి చదివిస్తే మంచి ఉత్తీర్ణత సాధించొచ్చన్నారు. ఉపాధ్యాయులు పదోతరగతి విద్యార్థుల పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బంట్వారంలో..



బంట్వారం: విద్యార్థులతో పాఠాలు చదివిస్తున్న ఎంఈఓ చంద్రప్ప

బంట్వారం: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలంటూ ఎంఈఓ చంద్రప్ప ఆకాంక్షించారు. గురువారం ఆయన కోట్‌పల్లి మండలంలోని రాంపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో పాఠాలు చదివించారు. ప్రాథమిక స్థాయినుంచే బాగా చదువుకోవాలన్నారు. ప్రశ్నించే తత్వం ఇప్పటి నుంచే అలవర్చుకోవాలన్నారు. పాఠ్యాంశాల్లో ఏమైనా అర్థం కాకుంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. చదువుతో పాటు ఆటలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ప్రతిరోజు దినపత్రికలు, పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. ఉపాధ్యాయురాలు మానసకు పలు సూచనలు చేశారు.

గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్



మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్

ఏఎంసీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్

తాండూరు రూరల్: గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ అని తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్ అన్నారు. గురువారం పెద్దేముల్ మండలం కందనెల్లి తండా సమీపంలోని యాడి బాపుగుట్టపై జాగో బంజార సమాజ్ వ్యవస్థాపకుడు సురేందర్‌నాయక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఠల్‌నాయక్ మాట్లాడుతూ. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలన్నారు. సొంత ఖర్చుతో సురేందర్ నాయక్ ఆలయ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. గుట్టపై బోరు వేయించి తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం సురేందర్‌నాయక్ మాట్లాడుతూ.. రూ.2 కోట్లతో గుట్టపై శివాలయం, జగదాంబ మాత, ఎల్లమ్మ తల్లి ఆలయంను నిర్మిస్తున్నామన్నారు. తన వంతుగా రూ.40లక్షల విరాళం అందజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో జాగో బంజార వ్యవస్థాపకులు రమావత్ శాంతిదేవి, గిరిజన బంజార కన్వీనర్ పాండు నాయక్, విద్యుత్ ఏడీ శంకర్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ మధులత శ్రీనివాస్‌చారి, మదనంతాపూర్ మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతో మానసిన ప్రశాంతత

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి
- కేశంపేటలో అంతర్రాష్ట్ర రెండెద్దుల బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కేశంపేట: దైవ చింతన కలిగి ఉంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అలివేలుమంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అంతర్రాష్ట్ర రెండెద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేర్వేరుగా పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పోటీలను తిలకించారు. అనంతరం గెలుపొందిన వారికి నిర్వాహకులు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... గ్రామస్తులు ఐకమత్యంగా వేడుకలు జరపడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో మొదటి బహుమతి వైపీఆర్ బుల్స్, ఎల్చాల ప్రసన్నరెడ్డి, నాదర్‌గుల్(హైదరాబాద్), రెండో బహుమతి కుందురు రాంభూపాల్‌రెడ్డి, గంపరమన్నుదిన్నే(నంద్యాల), మూడో బహుమతి కేవీఆర్ బుల్స్, కటకం వెంకటేశ్వర్లు, ఇనిమెట్ల(పల్నాడు జిల్లా), నాలుగో బహుమతి షేక్ మహ్మద్, షేక్ ఫరీద్, బలికురవ(బాపట్ల జిల్లా), ఐదో బహుమతి పావులూరి వీరస్వామి చౌదరి, బలికురవ(బాపట్ల జిల్లా) ఎద్దులు పోటీల్లో ప్రతిభ చూపాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, నాయకులు వీరేష్, వెంకట్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

రైతు సేవకు మరో అవకాశం

ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



ధారూరు పీఏసీఎస్ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న సీఈఓ, సిబ్బంది

ధారూరు: మరో ఆరు నెలల పాటు మండల రైతులకు సేవ చేసే అవకాశం లభించిందని ధారూరు పీఏసీఎస్ చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం ధారూరు పీఏసీఎస్ కార్యాలయంలో పాలకవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పాలకవర్గ పదవీకాలన్నా మరో ఆరు నెలలు పొడిగించిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ కార్యవర్గం ఏకగ్రీవంగా తీర్మాణం చేసిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మరో అవకాశంతో పీఏసీఎస్ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. సంఘం ఆధ్వర్యంలో కామన్ సర్వీస్ సెంటర్ ఏర్పాటు చేయాలని పాలకవర్గం తీర్మాణించిందని చెప్పారు. అనంతరం పాలకవర్గ సభ్యులను సీఈఓ నర్సింలు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు ఎం.శివకుమార్, కె.గోపాల్‌రెడ్డి, జరీనాబేగం, మల్లమ్మ, రవీందర్, అబ్దుల్‌కరీం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పూడూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రాత్రి చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రాకంచర్ల గ్రామానికి చెందిన అంగోత్ తరుణ్ (24) రాకంచర్ల కమాన్ నుంచి రాకంచర్ల గ్రామం వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడని తెలిపారు. వెనుకాల నుంచి వస్తున్న క్రేన్ వాహనం యొక్క చైన్ వెనుక నుంచి తగలడంతో తరుణ్ రోడ్డుపై పడిపోయాడు. దీన్ని గమనించిన స్థానికులు అతనిని పరిగి ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సత్తయ్య తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్లపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

బంట్వారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై హౌజింగ్ అధికారులు గురువారం నాగవరం గ్రామస్తులు అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇంటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. సందేహాలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి నివృత్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, హౌజింగ్ డీఈ సిరాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రాథోడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు భూముల పరిశీలన



ప్రభుత్వ భూములను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న శశాంక

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వం నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణాల కోసం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని మజీద్‌పూర్, పసుమాముల రెవెన్యూ గ్రామాల పరిధిలోని సర్కారీ భూములను గురువారం తెలంగాణ ఫ్లాషిప్ ప్రాజెక్ట్ కమిషనర్ శశాంక పరిశీలించారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, సర్వేయర్ జ్యోతి, ఆర్ఐలు నిజాముద్దీన్, ఇంద్రాజీతో కలిసి మజీద్‌పూర్ సర్వేనంబర్ 224, పసుమాముల సర్వేనంబర్ 422లోని భూములను పరిశీలించి, వివరాలను తెలుసుకున్నారు.

కృత్రిమ ఇసుక తయారీదారుల రిమాండ్

కద్తాల్: కృత్రిమంగా ఇసుక తయారు చేస్తున్న నలుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ శివప్రసాద్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి ముద్విన్ గ్రామ సమీపంలో గల వాగు నుంచి మట్టిని తీసి, కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఈ నెల 14న ఇసుక ఫిల్టర్లపై పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో నిర్వాహకులు మహేశ్, శ్రీశైలం, శేఖర్, జంగయ్య పరారు కాగా.. జేసీబీతో పాటు, ఐదు మోటార్లు, ఐదు స్టార్టర్ బాక్స్‌లు, పదిబోరు పైపులు, నాలుగు చొప్పున ఇసుక, మట్టి దిబ్బలను సీజ్ చేశారు. గురువారం విశ్వసనీయ సమాచారం మేరకు ముద్విన్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టగా.. పరారీలో ఉన్న నిందితులు పట్టుబడ్డారు. ఈ మేరకు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అనుమతులు లేకుండా ఇసుక తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

డిమాండ్ల సాధనకు సమష్టి కృషి



నియోజకవర్గ నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న కృష్ణ

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ

షాద్‌నగర్: డిమాండ్ల సాధనకు బీసీలందరూ ఐక్యంగా ముందుకు సాగాలని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ సూచించారు. గురువారం పట్టణంలోని ఓ హోటల్‌లో బీసీ సేన జిల్లా అధ్యక్షుడు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విచ్చేసిన బర్క కృష్ణ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీలు మరింతగా రాణించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల ఐక్యత, సామాజిక న్యాయ సాధనకు తమ సంస్థ అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. హక్కుల పరిరక్షణకు అందరూ కలిసి కట్టుగా ముందుకు సాగుతూ డిమాండ్లను నెరవేర్చుకోవాలన్నారు. ముఖ్యంగా బీసీ యువత ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో రాణించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం బీసీ సేన నియోజకవర్గ అధ్యక్షుడిగా చంద్రశేఖరప్పను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు బాబయ్య, సత్యం, లక్ష్మణ్, రాజు, చందులాల్, శంకరయ్య, జగదీష్ గౌడ్, మల్లేశ్‌గౌడ్, శివకుమార్, రవి, రాఘవేందర్, రమేశ్, వరప్రసాద్, చందు, సత్యం, హరీశ్‌కుమార్, నరేశ్, సాయి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలు



యువకులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుధాకర్

ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి

పహాడీషరీఫ్: నేరాల పట్ల అవగాహన పొంది వాటికి దూరంగా ఉండాలని మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి సూచించారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిస్మిల్లా కాలనీలో బుధవారం రాత్రి ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో ఆయన కలిసి విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా స్థానికులకు నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశానుసారం నిత్యం ఏదో ఒక బస్తీలో విజిబుల్ పోలీసింగ్ చేపట్టి ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్, గంజాయి లాంటి వాటికి బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. వాటితో కలిగే నష్టాలను ఈ సందర్భంగా వివరించారు. సైబర్ క్రైమ్స్ పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఆకర్షణీయమైన లింక్‌లను ఓపెన్ చేయరాదని సూచించారు. రహదారి నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. సెల్‌ఫోన్లు విరివిగా వాడుతూ దుష్ప్రభావాలకు లోనుకారాదన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులు నమ్మి శాంతి భద్రతల భంగం కలిగించేలా వ్యవహరించకూడదని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు యూసుఫ్ జానీ, శ్రీనివాసులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా, ఇద్దరికి గాయాలు




ప్రమాద స్థలంలో కారు

యాచారం: ఓ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు, మాల్‌లో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. తిరిగి నగరానికి వస్తున్న క్రమంలో వారు ప్రయాణిస్తున్న కారు.. అతి వేగంతో అదుపుతప్పి చింతపట్ల గేట్ సమీపంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉపాధిహామీ పనులు ప్రారంభించండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

షాద్‌నగర్‌రూరల్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను జిల్లా వ్యాప్తంగా వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య కోరారు. గురువారం పట్టణంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనులు లేకపోవడంతో కూలీలు ఖాళీగా ఉంటున్నారన్నారు. వేసవి ఎండలు తీవ్రంగా ఉండటంతో బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు పనులను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో చేసిన ఉపాధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లను మాత్రమే కేటాయించిందన్నారు. ఈ పరిమితిని పెంచాలన్నారు. ఉపాధి కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా రోజూ రూ.700 ఇవ్వాలని, రెండు వందల రోజుల పని దినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. టెంట్లు, మంచినీళ్లు, గడ్డపార, పార, రవాణా సౌకర్యం తదితర ఏర్పాట్లను ప్రభుత్వం కల్పించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య, నాయకుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.